దేవుణ్ణి చూసినవాడు

గవరయ్య పెళ్ళాం లేచిపోయిందన్న వార్త ఊరుఊరంతా ఉత్సాహంగా వ్యాపించింది. అంతకుముందు రోజునే చైనా ఇండియా సరిహద్దులలో దురాక్రమణ చేసిందనీ, యుద్ధం జరుగుతూన్నదనీ వచ్చిన వార్త చటుక్కున అప్రధానమైపోయి అందరూ మరచిపోయారు కూడా. ఆడది లేచిపోవడంలోని విశిష్టతని ఈ వూరువారొక్కరే గుర్తించారా అనిపిస్తుంది యింత తెలుగు దేశంలోనూ!

రోడ్ల కూడలిలో, కాఫీ హోటలులో (ఆ వూళ్లో ఒకటే వుంది) పొలంగట్లనీ, పంచాయతీ బిల్డింగ్ దగ్గరా పురుషులూ; పెరటి గోడల దగ్గరా, బావులూ, నీలాటి రేవుల దగ్గరా ఆడవాళ్ళు ఈ విషయాన్నే చిత్ర విచిత్రంగా చెప్పుకుంటున్నారు. వట్టి లేచిపోవడమే అయితే యింత సంచలం కలిగించకపోను; అందులోనూ ఎందుకూ పనికిరాని ఎదురింటి అరుగుమీది మిషన్ కుట్టుపనివాడితో లేచిపోవడమే మరీ విడ్డూరంగా వుంది. ఇంతకన్న మరో ఏ పెద్దమనిషితో లేచిపోయినా యింత అప్రదిష్ట ఉండకపోనని వూళ్ళో అనుభవజ్ఞులైన పెద్దలు అనుకున్నారు. చాలా మంది యువకులు గవరయ్య భార్య తమని నిష్కారణంగా అవమానించినట్టూ అన్యాయం చేసినట్టూ బాధపడ్డారు.

"వాడిలో ఏం చూసి లేచి పోయిందత్తా" అని మూడోసారి అడిగింది తన అత్తని ఒక పడుచు తనకుతూహలం ఆపుకోలేక.

"పోనీ నువ్వే వాడితో లేచి పోకపోయావా నీకు తెలిసొచ్చును." అంది అత్తగారు ఏడుపుతో, కోపంతో.

"గవరయ్యకి బాగా శాస్తి అయింది" అని ఏకగ్రీవంగా ఆబాల గోపాలమూ తీర్మానించారు. గవరయ్యను చూసి జాలిపడినవాడూ, సానుభూతి తెలిపినవాడూ ఒక్కడు లేడు.

గవరయ్య అంటే ఆ వూళ్ళో అందరికీ అసహ్యం. మనిషి కూడా నల్లగా ఎగుడుదిగుడుగా వుంటాడు. మొహంమీద స్ఫోటకం మచ్చలు. పెదాలు లావుగా మోటుగా వుంటాయి. కనుబొమ్మలు గుబురుగా గొంగళీ పురుగులు అతికించినట్లు వుంటాయి. ఊరికి శివారున వున్న పెద్ద పెంకుటింటి లోగిలిలో గవరయ్య వుంటాడు.

"నాకు తెలుసును. యిలాంటిదేదో జరుగుతుందని" అన్నాడు కన్నులరమూసి అవధాని. అవధాని ఆ వూళ్ళో ధర్మకర్త.

మునసబు చలపతీ, కరణం నరసింహమూ తల వూపారు. దాంతో మరికాస్త ఉత్సాహంతో ఉపనిషద్వాక్యంలాంటి పై వాక్యానికి వ్యాఖ్యానం చెప్పాడు ధర్మకర్త.

"వేణుగోపాలస్వామి వూరికే పోనిస్తాడా? ప్రథమ కళత్రం చావనే చచ్చింది, ఇంక ఈ రెండో ఆవిడ చావుకన్న ఘోరమైన పని చేసి వూరుకుంది. ఒక్క ధర్మకార్యం చేశాడా? ఒక్క మంచిమాట చెవిని పెట్టాడా?"

మున్సబు చలపతి చేతికర్రను నేలమీద తాటించి అన్నాడు "ఒక్కరిని దగ్గరకు రానిచ్చాడా? కర్కోటకుడండీ యీ గవరయ్య. ఎంత అహం, ఎంత పొగరు...."

"పాపపు సొమ్మండి పాపిష్టి ఆర్జితం! దాని ఫలితం వూరికే పోతుందా? మొన్న కుర్రాళ్ళందరూ వెళ్ళి భజన చందాకి ఒక్క రూపాయి – ఒక్క రూపాయి యిమ్మంటే తరిమి కొట్టాడుట...." అన్నాడు కరణం.

గవరయ్య యిరవై ఏళ్ళ క్రితం ఇరవై ఏళ్ళవాడు ఈవూరొచ్చాడు. ఈ వూళ్ళో అతనికో మేనత్త వుంది. తల్లీ తండ్రీ లేని అతను యీ మేనత్త దగ్గరకు వచ్చిపడ్డాడు. వస్తూనే కొంత డబ్బుకూడా తీసుకుని వచ్చాడు. ఈ వూరికి రెండు మైళ్ళ దూరంలోనే టౌను వుంది. రోజూ ఉదయమే టౌన్‌కి వెళ్ళి చీకటి పడ్డాక తిరిగొచ్చేవాడు. కొన్నాళ్ళకి తోళ్ళ వ్యాపారం చేస్తున్నాడని తెలిసి అందరూ "హరి హరీ" అని చెవులు మూసుకున్నారు. మేనత్తతో యిది చాలా పాపమనీ, బెడిసి కొడుతుందనీ చెప్పారు. కానీ మేనత్త ఏమీ మాట్లాడలేదు. కొందరు చొరవచేసి గవరయ్యతో జంతుచర్మ విక్రయం మంచిదికాదని చెప్పారు. "జంతువులేంఖర్మ మనుషుల తోలునే అమ్ముతాను. మరీ పల్చన కాబట్టి పనికిరాదు కాని" అని సమాధాన మిచ్చాడట గవరయ్య. గవరయ్య ఒంటెత్తు మనిషి. ఎవరితోను మాట్లాడడు, కలవడు. అసలు గవరయ్య నవ్వడం ఎవరూ చూడలేదు. అదే కాక గవరయ్యకి "పాపం" "పుణ్యం" అనే భేదాలు వున్నట్టు కూడా తెలియదు.

ఈ యిరవై ఏళ్ళలోనూ అతను లక్షరూపాలయకి పైగా సంపాదించాడని ప్రతీతి. ఊళ్ళో పెద్దలు - ఉదారులూ ధర్మపరులూ కాబట్టి, అతని పాప వ్యాపారాన్ని క్షమించి అతని శ్రేయస్సుకోరి, అతని ఆముష్మిక సుఖం కోసం దానధర్మాలు చేయమనీ, గుడి మండపం కట్టించమనీ, పాఠశాల బిల్డింగ్‌కి చందా యిమ్మనమనీ, సప్తాహాలు చేయించమనీ చెవిలో యిల్లు కట్టుకుని చెప్పారు. గవరయ్య గుండ్రంగా లోతుగా వున్న కళ్ళని కుంచించి మోటైన పెదాలమధ్య చుట్టని నొక్కిపెట్టి, విసుగ్గా, విసురుగా "నేనొక్క కానీ యివ్వను. పోయి మీ అబ్బతో చెప్పుకోండి" అనేవాడు. మంచి లేదు, మర్యాదాలేదు వీడికి అనుకున్నారు వాళ్ళందరూ పరోక్షంగా. అతనికి లక్ష రూపాయిలుండడంవల్ల అతని ఎదురుగా అలా అనలేదు, వాళ్ళు సహజంగా జ్ఞానులు కాబట్టి.

గవరయ్య మేనత్తగారింటికి చేరిన కొద్ది రోజులలోనే మొదటి భార్యను తీసుకొచ్చాడు. ఆ భార్యనెక్కడికీ పంపేవాడు కాడు. పొరు

గిళ్ళకు కూడా వెళ్ళేదికాదు. మేనత్తా, భార్యా, గవరయ్యా - ముగ్గురూ మూడు దెయ్యాలలా వుండేవారు. ఒక పుకారుకూడా వూళ్ళోవుండేది. గవరయ్య పెళ్ళాన్ని ఏదో భూతం ఆవహిస్తూంటుందనీ, ఊళ్ళో ఎవరికీ తెలియకుండా అందరూ నిద్రపోయే అర్ధరాత్రి వేళ భూతవైద్యుడెవరో వచ్చి ప్రయోగాలు చేస్తాడని, ధూపాలు వేస్తాడనీ చెప్పుకుంటూంటారు. ఇంత ఒంటరిగా సంఘజీవితంలో కలవకుండా వీళ్ళలా వుంటున్నారో ఎవరికీ అర్థంకాలేదు. కొంత కాలానికి గవరయ్య పుట్టిన వూరు నుంచి వచ్చానని చెప్పుకుంటూ కొన్నాళ్లు ఆ వూళ్ళో ఒక గాజుల వర్తకుడు తిరుగుతుండేవాడు. అతను గవరయ్యను గురించిన భోగట్టా అందజేశాడు.

గవరయ్య తండ్రి చాల దుర్మార్గుడట. జూదమూ, తాగుడూ రెండింటినీ సమపాళంగా అభ్యసించి ప్రాక్టీసు చేశాడుట. తల్లి రోగిష్టిదై మంచానపడి ఉండేది అందువలన గవరయ్య తండ్రి పొరుగూళ్ళో ఒకావిడని వుంచుకొన్నాట్ట. గవరయ్య చిన్నతనంలో తల్లి సంరక్షణ ఏమీ ఎరగనివాడు తండ్రికున్న చెడ్డ పేరువలన గవరయ్యతో ఎవరూ కలిసేవారు కాదు. ఆఖరికి ఆ వూరి బళ్ళో కూడా చేరనివ్వలేదు. ఆ స్కూలు స్థాపించినాయన అక్కడ పేరొందిన భూస్వామి. ఆ భూస్వామితో గవరయ్య తండ్రికి ఎడతెగని వైరం. భూస్వామి పలుకుబడీ, దైవభక్తీ వున్నవాడు. ప్రతిఏటా సుబ్బారాయుడి షష్టి ఉత్సవాలూ, అన్న సంతర్పణా చేయించేవాడు. గవరయ్య తండ్రి రౌడీముఠాతోచేరి ఆవుత్సవాలలో గలభా చేయించేవాడు. ఒకానొక ప్రాణావసర సమయంలో గవరయ్య తండ్రిచేత యిచ్చిన దానికన్న రెండు రెట్లుకి తనఖా వ్రాయించుకొని వున్నభూమి కాస్తా అన్యాయంగా కాజేశాడని గరవయ్య తండ్రి ఆరోపణ, కాని వూళ్ళో పెద్దలు ఒక రౌడీ మాటల్ని నమ్మేటంత అవివేకులు కారు. అదేకాక వాళ్ళు చాటుమాటుగా వడ్డీ వ్యాపారం ఆ భూస్వామి పద్ధతి మీద చేస్తున్నారు కాబట్టి పెద్దమనిషి, పరమ భక్తుడూ అయిన భూస్వామి యిలాంటి అక్రమం చేస్తాడని కలలో కూడా ప్రజా సామాన్యం నమ్మదలచుకోలేదు.

గవరయ్య ఒంటరితనాన్ని చూసి బాధపడి తండ్రి ఒక్క కుక్క పిల్లనీ, రెండు పిల్లిపిల్లల్నీ తెచ్చి యిచ్చి వాటితో ఆడుకోమనేవాడు. 'మనుషులకంటె యివే నయం' అనేవాడు రోగిష్టి అయిన భార్యతో; గవరయ్య బాల్యమంతా కుక్కలతో, చెట్లతో, గోడలతో ఆడుకుంటూ గడిపాడు కొన్నినాళ్ళకి రోగిష్టి తల్లిచనిపోయింది. ఆమె చనిపోవడంతో గవరయ్యతండ్రి మొండగాలెక్కువై పోయాడు. గవరయ్య తండ్రికి భార్య అంటే చాలా ప్రేమ. ఆమె జబ్బుకోసం చాలా డబ్బు ఖర్చు పెట్టాడు ఇప్పటికీమెకు చివరి రోజుల్లో వైద్య సహాయం చేయించలేకపోవడం భూస్వామి అక్రమం వల్లనేనని ఆలోచించిన గవరయ్య తండ్రి మరీ పేట్రేగిపోయాడు. భూస్వామి పాలేరు పొలంలోంచి వస్తూండగా ఎవరో వాడి తల రెండు చెక్కలయేట్టు యినుపకడ్డీతో కొట్టారు. భూస్వామి తన అనుమానమంతా గవరయ్య తండ్రిమీద వుందన్నాడు. గవరయ్య తండ్రిని అరెస్టుచేశారు. కేసు మోపారు. ఊళ్ళో అందరూ బలమైన సాక్ష్యంయిచ్చారు. వాళ్ళ స్వయంగా చూసినా చూడకపోయినా, భక్తిపరుడైన భూస్వామి ఆజ్ఞల్ని దైవాజ్ఞగా శిరసావహించారు. గవరయ్య తండ్రికి యావజ్జీవ శిక్ష పడింది. తండ్రి ఆఖరిమాటగా కొడుకుతో 'ఎవర్నీ నమ్మకు, నీ కాళ్ళమీద నువ్వు నుంచో, ఈ మనుషులందరూ దొంగ వెధవలు, విష సర్పాలు' అని చెప్పి మరీ పోలీసులతో వెళ్ళాడు.

తల్లిలేని, తండ్రిలేని, గవరయ్య ఆ యింట్లో బెంబేలెత్తిపోయాడు. బెంగతో రెండు రోజులు తిండీ తిప్పలులేక యింట్లో మూలగా కూర్చుని పధ్నాలుగేళ్ళ గవరయ్య హోరుమనిఏడ్చాడు. ఎవరూ ఆచాయలకి రాలేదు, పలకరించలేదు. రౌడీ, హంతకుడూ అయిన తండ్రి దుర్గుణాలు వీడికి సంక్రమించి వుంటాయనీ, వీడి కెంతదూరంలో వుంటే అంత మంచిదని ఆవూళ్ళో మంచివాళ్ళందరూ అనుకున్నారు కాబోలు. గవరయ్యకి జ్వరం వచ్చింది. మందులేదు, మాకులేదు. జ్వరం స్ఫోటకంలోకి మారింది.

ఆ యింట్లోంచి రాత్రిళ్ళు "అమ్మో చచ్చిపోతున్నానేవ్" అనే కేకలు వినవచ్చేవి భయంకరంగా హీనంగా.

మశూచి అని తెలియగానే ఆ పొలిమేరలలోకూడా జనం నడవడం మానివేశారు. "ఈకొడుకుకూడా పోతే వూరికి పీడా వదలిపోతుం"దన్నారు కొందరు. ఇలా వుండగా ఒక రోజు సాయంత్రం ఒక గుర్రబ్బండీ గవరయ్య ఇంటిముందాగింది. దానిలోనుంచి నలభైఏళ్ళ స్త్రీ దిగింది. ఒంటినిండా నగలున్నాయి. మనిషి పొడుగ్గా, బలంగా వుంది. చెంపలదగ్గరైనా జుట్టు నెరవలేదు. ఆ వీధివీధంతా వింతగా ఆమెకేసి చూస్తూ నుంచున్నారు. కాని ఆమె పక్కకికూడా చూడకుండా సరాసరి లోపలికి వెళ్ళిపోయింది. నౌకరు పెట్టెలన్నింటినీ లోపల పెట్టి తలుపులు దభాల్న వేసేశాడు.

నౌకరు ద్వారా ఆమె గవరయ్య తండ్రికి యిలాకా వున్న ఆవిడనీ, ఆరునెలలు పుణ్యక్షేత్రాలు సేవించి రెండురోజుల క్రితమే తిరిగి వచ్చిందనీ, గవరయ్య తండ్రికి యావజ్జీవ శిక్ష పడడమూ కొడుకు దిక్కులేనివాడై వుండడమూ తెలిసి మొకాయెకిని సామాను పట్టించుకుని ఆ వూరు వచ్చేసిందనీ తెలిసింది. అంతే, నాటినుండీ గవరయ్య ఆమె సంరక్షణలో పెరిగాడు. జబ్బునుంచి కోలుకున్న గవరయ్య మరీ వికృతంగావున్నా ఆమె లక్ష్యం చేయలేదు. తండ్రితో సంబంధమున్నంతమాత్రాన ఈ చాతకాని వికారపు కొడుకు బాధ్యత తీసుకోవడంలోని అవివేకాన్ని ఒకరిద్దరు చొరవగల స్త్రీలు ఆమెకి చెప్పిచూశారు. కానీ ఎవర్నీ లక్ష్యంచేయని గుణం ఆమెలో వుంది. కొన్నాళ్ళకి ఒక పిల్లని వెతికితెచ్చి గవరయ్యకి పెళ్ళిచేసింది. గవరయ్య ఇరవయ్యో యేట ఆమె మరణించే ముందు గవరయ్యకి తన నగలూ, పదివేల రూపాయల నగదూ యిచ్చివేసింది.

తర్వాత అత నీ వూరిలో మేనత్త ఇంటికి రావడం, తోళ్ళ వ్యాపారం చేయడమూ, ఏడెనిమిదేళ్ళకు మొదటి భార్య పోవడమూ

ఊళ్లో అందరికీ తెలిసినదే. ఈ చరిత్ర అంతా గాజుల వర్తకుడి ముఖతః విన్న తర్వాత గవరయ్య అంటే వున్న వాళ్ళ అసహ్యభావం యీసారి తార్కికమైన ఆధారంతో మరింత గట్టిపడింది. తండ్రి దుర్మార్గుడు, హంతకుడు. వీడు చిన్నతనంనుండి పిల్లులతో కుక్కలతో కలిసి జంతు లక్షణాలు అలవరుచుకున్నవాడు. పైగా వీడి పెంపకం ఒక చెడిన స్త్రీ చేత. ఇంతటి అమానుషుడు వచ్చి వచ్చి తమ ఊళ్ళో పడ్డాడనే బాధ ఒకవైపున పీడించింది నలుగుర్నీ.

అయినా అవధాని మొదలైన పెద్దలు మొదట నిరాశ చెందలేదు. గవరయ్య దుర్మార్గుడు నిజమే. వికృత రూపుడు – అదీ నిజమే – పిసినిగొట్టు. ఎవరికీ కానీ రాల్చడు – ఒప్పుకున్నాం – ఒంటెత్తు మనిషి. సభ్యత లేనివాడు – అందరికీ తెలుసును; అయితేనేం ధనవంతుడు. ఆ ధనాన్ని సత్కార్యాలకు ఉపయోగించేటట్టు చేస్తే అతనికీ, పెద్దలకీ ముక్తివుంది. ఇంత ఉదారాశయంతో ఎన్నో విధాల ఎన్నోసార్లు గవరయ్యని కదిపి చూశారు. వేణుగోపాలస్వామి ఉత్సవాలన్నారు. మండపం కట్టించాలన్నారు. ఒకవైపు ఒరిగిన ప్రాకారం బాగుచేయించాలన్నారు – దేనికీ గవరయ్య లొంగిరాలేదు. చివరికి గుళ్ళోకివచ్చి దైవదర్శనం చేసుకుని ప్రసాదం తీసుకోమన్నారు. అది ఖర్చులేనిపని ఎప్పటికైనా గవరయ్య రాతిగుండెలలో భక్తివిత్తనం నాటుకుంటుందని వాళ్ళ ఆశ. కాని ఏనాడూ గవరయ్య గుడి చాయలకికూడా రాలేదు.

ఒక తోటివాడు నాస్తికుడై పాపియై పోతూంటే ఊరుకోలేని మంచితనంవలన, కార్యదీక్షవలన ఊరి పెద్దలతనిమీద బహిష్కారబాణం ప్రయోగించారు. కానీ అదేమీ పనిచేయలేదు. ఎందుకంటే గవరయ్య ఊరినే బహిష్కరించాడు మొదటినుండి. చాకలీ, కోమటీ, మంగలీ ఆతనికి చాటుచాటుగా వాళ్ళవాళ్ళ సేవలందించడం మానలేదు. కూడా. నిక్కచ్చిగా వాళ్ళందరికీ జీతాలిస్తాడేమో గవరయ్య బేరాన్ని పోగొట్టుకోవడానికి వాళ్ళెవరూ ఇష్టపడలేదు.

మొదటి భార్య కాలుజారి నూతిలోపడి మరణించినప్పుడు అవధానీ తదితరులూ గవరయ్యని పరామర్శించారు. ఇదంతా కర్మ ఫలితమనీ, యిప్పటికేనా మేలుకోమనీ హెచ్చరించారు. కాని గవరయ్య ఖాతరు చేయలేదు. పైగా ఏడాదిలో తనకన్న పదిహేనేళ్ళు చిన్నదైన ఒక పిల్లను పెళ్ళి చేసుకుని యింటికి తీసుకొచ్చాడు. ఆ పిల్ల అందం మాట ఎటున్నా ఫ్యాషన్‌గా అలంకరించుకునేది. ఆమెని ఎంతో ఆప్యాయంగా ప్రేమగా చూసేవాడని గవరయ్యని గురించి అనుకునే వారు. అయితే ఆమె అయినా యిల్లుదాటి యీవలికి వచ్చేదికాదు. ఎవరేనా కుతూహలం కొలదీ వెళ్ళి పలకరిస్తే కబుర్లు సరదాగా చెప్పేది. ఎవరేనా గవరయ్య రూపాన్ని గురించిగాని వయస్సు గురించి గాని వ్యంగ్యంగా హేళనచేస్తే "ఆయన చాలా మంచివారు" అనేదిట. నాలుగు రోజుల కొకసారి ప్రక్క టౌన్‌కి బండి మీద వెళ్ళి సినిమా చూసి వచ్చేదిట. గవరయ్య తన నిబంధనల్ని ఈ భార్య విషయంలో సడలించాడని ఆశ్చర్యపోయారు. కానీ ఆ సడలింపు కూడా కొంతవరకే, ఆ యింటిలో వున్నవాళ్ళు అలాగ మనుషులకీ, వూళ్లో జరిగే సంఘటన లకీ దూరదూరంగా వుండవలసిందే.

ఎదురింటి అరుగుమీద వున్న మిషన్ కుట్టువాడితో యీమెకి లేచిపోవడం దాకా యింత చనువు ఎలా ఏర్పడిందో ఎవరికీ తెలియదు. కాని ఈ దుస్సంఘటనతో మున్సబూ, కరణమూ, తదితరులూ మహదానందం పొందారు. కటిక చీకట్లో వాళ్ళకి మళ్ళీ ఆశాకిరణం గోచరించింది. ఇనుం వేడెక్కినప్పుడే సాగగొట్టాలన్నారు. నలుగురూ కలసి ఒకరోజున గవరయ్య యింటికి వెళ్ళారు. ఇల్లు చాలా పెద్దది. మండువాలోగిలి. ఇంటిచుట్టూ పెద్దదొడ్డి, వెనకాల గడ్డివామూ, దూడల పాకా, చెట్లు, చేమలూ వున్నాయి. ఆ పైన యింకేమి యిళ్ళు లేవు. అన్నీ పొలాలే. మేనత్తవున్న చిన్న లోగిలిని క్రమ క్రమంగా పెంచే యింత యింటిని చేశాడు గవరయ్య.

ఆ ఇల్లు అన్ని ఇళ్ళలా వుండదు. కలకల లాడుతూన్నట్టు వుండదు. ఏదో భయంకరమైన ఏకాంతం ఆ ఇంట్లో పేరుకున్నట్టు వుంటుంది. రాత్రుళ్ళు దెయ్యాలు గదిలోంచి గదిలోకి వంకర కాళ్ళతో తిరిగి తిరిగి పగటివేళ అటకమీదా, చూరు మూలల్లోను దాక్కున్నట్టు వుంటుంది. పలుకుబడీ, స్తోమతూ సహజంగా ధైర్యమూ వున్న ఆ నలుగురికీ ఆ ఇంట్లో అడుగు పెడుతూంటే కొంచెం బెదురుగా వుంటుందన్నమాట నిజం.

గోడకు చేరబడి కళ్ళు మూసుకుని వున్నాడు గవరయ్య. బనీనులోంచి అతని బలిష్ఠమైన రొమ్మూ, కండలూ మశూచికపు గుంటలతో నాట్లుతిన్న దమ్మిడాదుల్లా వున్నాయి. అడుగుల చప్పుడు విని కళ్ళు తెరచి చూశాడు. కళ్లు ఎర్రజీరలతో తాగినవాడి కళ్ళలా వున్నాయి. అవధానీ, మున్సబూ, కరణమూ, మరొక పెద్ద మనిషి తేరి చూస్తున్న గవరయ్యకి దగ్గరగా వున్న బల్లమీద కూర్చున్నారు. గవరయ్య ఏమన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూశాడు.

"నీకు రావాల్సిన కష్టంకాదోయ్ గవరయ్యా. నిమ్మకు నీరోసినట్టు వుండే స్వభావం నీది. ఒకరిజోలీ, శొంఠీ అక్కర్లేదు. విషయం తెలియగానే 'అరే! పాపం' అని మనస్సు కొట్టుకులాడి పోయిందంటే నమ్ము" అన్నాడు కరణం.

గవరయ్య మాట్లాడలేదు. అలాగే చూస్తున్నాడు.

పన్నులు కట్టడంలో కానీ, పాలేళ్ళకి జీతాలివ్వడంలో కానీ – తన ధర్మం తాను ఠైముకి నెరవేర్చుకునేవాడు. ఒకరిసొమ్ము ఎప్పుడూ తనవగ్గర వుంచుకోలేదు. సుబ్బయ్యగాడికి సాలు తిరక్కముందే ధాన్యం కొలిచి యిచ్చేశాట్ట గవరయ్య. "వాడు తెగ చెప్పుకోవడమే – మా కామందు మహదొడ్డమనిషి అని...." అన్నాడు మున్సబు. గవరయ్య అలాగే చూస్తున్నాడు. అతను వీరి మాటలు వింటున్నాడో లేదో తెలియదు.

"కాని ఒక్కమాట గవరయ్యా బాబూ!" మందంగా, గంభీరంగా, అందులోనే ఒక విశేషమైన దయా, మృదుత్వాన్నీ కలిపి వాచా చమత్కారియైన అవధాని ధర్మకర్తృత్వపు హోదాతో పలికాడు. "భగవంతుడి ఆసరాలేకుండా ఎటువంటివాడూ యీ సంసార సాగరాన్ని సుఖంగా దాటలేడనుకో. నువ్వా ఉత్తముడివి. ముక్కుకి సూటిగా పోయేవాడివి. అయితేనేం. నీ వ్యాపారం వుంది చూడు - అది కేవలం ధర్మవిరుద్ధమని శాస్త్రాలు నొక్కి చెబుతున్నాయి. అయితే కలియుగంలో కొన్ని మినహాయింపులు చేశారు. మనుషులు అందుకని భయపడవాలేదు. కాని ఒక్కటి చెప్పారు - ఏమైనా ఆ భగవంతుని స్మరించడం మానకుండావుంటే అన్ని కష్టాలూ మంచులా విడిపోతాయి. ఫలం, పుష్పం, పత్రం, తోయమ్ - అన్నారు - భగవానుడు అల్పసంతోషి...."

క్రమంగా అందరి మొహాలలోను విజయాన్ని సూచించే నవ్వు అలముకొంది. ఎప్పుడూ కసురుకొని విసుక్కునే గవరయ్య యీ వేళ మౌనంగా వున్నాడు. అభేద్య మనుకున్న కోటగోడకు పగులు ఏర్పడింది, ఇంక మెలమెల్లగా గవరయ్యని మార్చివేయ వచ్చుననే భావం వారిలో ఏర్పడింది. అందరూ లేచారు. వెళ్ళివస్తామన్నారు. కాని గవరయ్య అలాగే శిలాప్రతిమలా కళ్ళప్పచెప్పి చూస్తూ కూర్చున్నాడు.

2

ఒక ఏడాది గడిచింది. అప్పుడప్పుడు కరణము, మున్సబూ వగైరాలు గవరయ్య ఇంటికి వచ్చి పోతున్నారు. గవరయ్యని దైవ దర్శనానికని, హరికథకనీ, మరొకటనీ చెప్పి పిలుచుకు వెళుతున్నారు. ఊళ్లో వాళ్లకూడా గవరయ్య వీధిలో వెళుతూంటే నమస్కారాలు పెడుతున్నారు. గవరయ్య మాత్రం ఏమీ మాట్లాడడు. మంత్రించిన వాడిలా ఆ దేవాల

యంలో కానీ, హరికథలో కానీ కూచుంటాడు. సగంలో ఒక్కొక్కసారి చటుక్కున లేచి వెళ్ళిపోతాడు. పెద్దలు తలపంకించి 'రాక్షసముండా కొడుకు. ఒక్కరోజులో మారతాడా' అనేవారు.

"మారి కేం చేస్తాడు ? సంఘాన్నీ, ధర్మాన్నీ కాదని ఎక్కడికి పోతాడోయ్ వీడు" అనేవాడు అవధాని.

వేణుగోపాలస్వామి గుడి ప్రాకారం పూర్తిగా పడిపోయేటట్టు వుంది. ఇంక జాగుచేస్తే లాభం లేదనుకున్నారు వూళ్ళో పెద్దలు. పాతికవేలైనా వుంటేగాని యీ పని జరగదు. ఇంత మొత్తాన్ని ఒక్క గవరయ్యే తప్ప యివ్వగలిగినవాడు మరొకడు లేడన్నారు. ఈ యేవాది లోనూ గవరయ్య చాలా లాభాలు సంపాదించాడు. తోళ్ళ వ్యాపారం అలా వుండగా, పట్టణంలో నూనె మిల్లులో ముప్పాతికవాటా కొన్నాడు. ఒక్క వేరుశనగ నూనెలోనే ఒక లకారం లాభం వచ్చిందని వూరంతా వింతగా చెప్పుకుంటున్నారు. ఈ అభివృద్ధికి కారణం అతనిలో పొడచూపిన దైవభక్తి అని వాళ్ళనుకోవడమే కాకుండా అతడు ఏమరిపోతాడేమోనని అతనివద్ద మరిమరీ పనికట్టుకు చెప్పేవారు. ఒక మంచిరోజున మున్సబూ, కరణమూ, ధర్మకర్తా యింకా వూళ్ళో మోతుబరులూ, అందరూ కలిసి గవరయ్య యింటికివెళ్ళి ప్రాకారోద్ధరణను గురించి చెప్పారు. అతనే పూనుకోవా లన్నారు. "నీపేరు చిరస్థాయి అయిపోతుంది. గవరయ్యా. నీ పేరు మీదుగా రోజూ పూజా పునస్కారాలు జరిపిస్తాం" అనీ చెప్పారు.

"దేవుడికి అసలు గుడెందుకు ? ఆ గుడి చుట్టూ గోడెందుకు ?" అన్నాడు గవరయ్య చుట్ట చివరని నోట్లో నములుతూ.

నిశ్చేష్టులయా రందరూ. "అపచారం ! అపచారం !" అని లెంపలు వాయించుకున్నాడు కరణం.

ధర్మకర్త కరణానికి కన్ను గీటాడు. "గవరయ్య వేసిన ప్రశ్న సామాన్యమైంది కాదు. తత్వవేత్తల్నీ, మహర్షుల్నీ కూడా ముప్పు

తిప్పలు పెట్టిన జటిల ప్రశ్న అది. అయితే గవరయ్యలో మనకి తెలీ కుండానే గొప్ప సాధన జరుగుతోంది. నాలుగు రోజులు మనం ఓపిక పడితే గవరయ్య వంటి పెద్ద మనిషి తన ప్రశ్నకి తనే జవాబు పొందు తాడు. భగవదనుగ్రహం నేరుగా ఒక్కసారి రాదోయ్. అంచెలంచలుగా వస్తుంది. అలాగ వచ్చిన రోజున గవరయ్య ఏది- మన గవ రయ్యే వచ్చి "ఇదిగో అవధానిగారూ, ఈ పదివేలు దగ్గరుంచండి- ప్రాకారం కట్టించెయ్యండి" అని అనడూ?

గవరయ్య ఎప్పుడూ చెయ్యనివాడు అవధానికి నమస్కారం చేశాడు. "సెలవు తీసుకోండి. నాకు పనుంది. టౌనుకెళ్ళాలి" అని అంగలేసుకుంటూ వెళ్ళిపోయాడు. అవధాని ఆశ్చర్యపడ్డాడు. అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

"అవధానీ జయించావోయ్. తల వంచి నీకు నమస్కరించాడు కూడా! వీణ్ణి తగలెయ్య-మారుతున్నాడు. మారిపోతున్నాడు" అన్నాడు కరణం హుషారుగా.

"ఈ వర్షాకాలం వెళ్ళేసరికి- నే చెబుతున్నాగా - పాతికవేలూ మనముందు పడేస్తాడు. ఆ ప్రాకారంతోపాటు మన యిళ్ళకి ప్రహరీ గోడలు లేస్తాయి!" అన్నాడు మీసాల్లో మునిముసి నవ్వులు నవ్వుకుంటూ మున్సబు.

3

వర్షాకాలం రానే వచ్చింది. రావడంలో మంచి వూతంగా, కోపంగా, బలంగా వచ్చింది. కుంభ వృష్టిగా వర్షం, దట్టమైన మేఘాలతో నల్లబడిన ఆకాశం మెరుపులూ, వురుములూ ప్రకృతి పెళ్ళి పందిరిలా హడావిడిగా వుంది. రోడ్లు బురదైనా కుచ్చెళ్ళు నెత్తిపట్టుకొని ఆడవాళ్ళు, అందులో కొత్తగా పెళ్ళయిన వధువులు సరదాగా పేరంటా

లకి వెడుతూ వస్తున్నారు రైతాంగం అంతా పొలంపనుల్లో పడి పోయారు. మున్సబు పెళ్ళానికి కీళ్ళనొప్పులూ, అవధాని కూతురికి వేవిళ్ళూ అయినా గ్రామం వుమ్మడి సౌఖ్యానికి అవేమీ ఆటంకంగా లేవు. కరణం విధవ చెల్లెలు కిటికీలోంచి ఎదురింటికి చుట్టంచూపుగా వచ్చిన బస్తీ అబ్బాయికేసి అదేపనిగా చూస్తూ చెయ్యి వూపుతున్నా పాపం షార్టుసైటూ మెల్లకన్నూ మూలాన అతనికి ఆ సిగ్నల్స్ కనబడటంలేదు. ఎండైనా వానైనా గ్రామం శివార్లల్లో వున్న కూలీ నాలీ జనం, మురికిగుంటలూ పందులూ, జబ్బులూ అన్నీ సక్రమంగానే వున్నాయి. పంచాయితీవాళ్ళు కట్టించిన లైబ్రరీ బిల్డింగులో పేకాట నిరంతరం సాగుతోంది.

ఇలాంటి చల్లని సుఖమైన వాతావరణంలో పిడుగువంటి వార్త చటుక్కున ఊరంతటినీ దద్దరిల్ల చేసింది. మున్సబూ, ఒకరిద్దరు పెద్దలూ మున్సబు యింటి అరుగుమీద కూర్చుని శాలువ కప్పుకొని వెచ్చగా చుట్టలు కాలుస్తూ ఆధ్యాత్మిక గోష్ఠి నడుపుకుంటున్నారు. ఆ సమయంలో పానకాలు అక్కడికి పరుగెత్తుకుని వచ్చాడు. వాడి కళ్ళల్లో విపరీతమైన కంగారు ఉంది. వాడి వాలకం చూస్తే వాడి వెనకాలే భూకంపమో, వరదో గ్రామానికి వచ్చినట్టుంది.

"ఏంరా! ఏం జరిగిందిరా?" అన్నాడు మున్సబు.

"అదొచ్చిందండి. తిరిగివచ్చిందండీ" అన్నాడు పానకాలు.

రెణ్ణెల్లక్రితం మున్సబుగారి గిత్తదూడ కట్టు తప్పించుకొని పారిపోయింది. మున్సబు చిరునవ్వుతో "అయితే యింకేం నేవచ్చి చూస్తాలే. కొట్టాంలో కట్టేయ్" అన్నాడు.

"గిత్తకాదు బాబూ! గవరయ్య పెళ్ళాం!" అన్నాడు పానకాలు మెల్లగా. అందరూ చటుక్కున నిటారుగా కూర్చుని "ఆఁ ఆఁ ఏమన్నావ్!" అన్నారు ఏకకంఠంతో.

పానకాలు చెప్పిన వివరణ యిది. రాత్రి చాలా పొద్దుపోయాక పట్నంలో రెండో ఆట సినిమా చూసివస్తూన్న బట్టలకొట్టు నరసింహం వూరు సమీపించే వేళకి రోడ్డుకి పక్కగా చెట్లనీడల్లో ఎవరో కదులు తూండడం చూశాడు. అతనికి దెయ్యమేమో అని అనుమానం భయమూ కలిగి గుండెలు దడదడలాడాయి. అక్కడికి కాస్తదూరంలో పాకలో పడుకున్న పానకాలుని కంగారుగా లేపాడు ఇద్దరూ వచ్చి చూశారు. రేగినజుట్టూ నల్లని మాసినబట్టలూ, నడవలేక ఒక్కొక్క అడుగువేసే ఆడకూతుర్ని చూశారు. ఆమెచేతిలో చిన్నమూట వుంది. ఎవరా అని దగ్గర్నుంచి చూశారు. పోల్చలేకపోయారు. పలకరించారు. ఆమె మాటాడలేదు. ఆమె నడక వేగం హెచ్చించింది. వీళ్ళిద్దరూ అంతదూరం నుంచే ఆమెను అనుసరించారు. ఆమె పొలాలమ్మట వెళ్ళి గవరయ్య యింటి పెరటినానుకున్న పాకలోకి వెళ్ళింది. ఆ పాక గవరయ్య యింట పెరటికీ, పొలాలకీ మధ్యగా వుంది. పాకలో కర్రపేళ్ళు, పాతసీనారేకు డబ్బాలూలాంటి చెత్తాచెదారం అంతా వుంది గవరయ్యను లేపి చెప్దా మంటే యింత రాత్రివేళ లేపితే తంతాడని భయం వేసింది.

మళ్ళీ యిప్పుడా సంగతి జ్ఞాపకం వచ్చి పాకవైపువెళ్ళి చూశాడు. ఎవరో కాదు ఆ ఆడమనిషి — గవరయ్య పెళ్ళామే! కడుపు చాలా ఎత్తుగా వుంది. నెలలు నిండినట్టున్నాయి. గడ్డిమీద పడుకుని మూలు గుతూ వుంది.

"ఈ సంగతి గవరయ్యకు తెలుసునంటావా...." అన్నాడు మున్సబు.

"తెల్దుబాబూ. తెల్లారిగట్లనే లేచి టౌను కెళ్ళిపోతాడుగా గవ రయ్య" అన్నాడు పానకాలు.

మున్సబు తొందరగా లేచాడు. చెప్పులు వేసుకుని బయల్దేరాడు, అవధాని యింటికి. దారి పొడుగునా అందరూ పలకరిస్తున్నారు. "ఏం మున్సబూ, గవరయ్య పెళ్ళాం తిరిగొచ్చిందటగా, ఈ వూరూ, ఈ మడు సులు, ఏమైపోతన్నారు బాబూ. మంచీ, చెడ్డా, పున్నెంపాపం అన్నీ

మటికొట్టుకుపోతన్నయ్యా: లేచిపోయి కడుపులు సేసుకొనో్ళ్ళని మళ్ళీ ఏలుకుంటాఁవంటే ఊళ్ళోపిల్లలు రెచ్చిపోరటయ్యా! ఏమొచ్చింది బాబూ. ఈ ఊరికీ, పెద్దలకీ!" అంది అరవై ఏళ్ళుదాటిన ఒకావిడ అరుగుమీద నుంచుని. అవధానియింటికి వెళ్ళేలోపుగానే మున్సబుకి తెలిసిపోయింది ఊరంతా గవరయ్య పెళ్ళాం గురించి మాట్లాడుకుంటున్నారని. అవధాని చాలా చిరాగ్గా, కోపంగా వున్నాడు.

"మీకు తెలుసా" అన్నాడు మున్సబు మెట్లెక్కుతూ.

"ఆబాల గోపాలానికీ తెలుసును! మునసబు గిరీచేస్తున్న నీకే తెలవదు. ఎంతధైర్యం వుండి ఆ పాపిష్టిది యీ వూరొచ్చిందట! ధర్మభయం దైవ భయం ఎక్కడైనా వున్నాయా అని!"

కాస్సేపట్లో కరణమూ, వూరిపెద్దలూ అందరూ అక్కడ సమావేశమయ్యారు. గవరయ్య తక్షణం ఆ చెడిపోయిన దాన్ని తరిమేస్తాడో లేక తనే వూరినుంచి వెళ్ళిపోతాడో తేల్చుకోవాలన్నారు. ఆ రోజు వుదయమే మాలగూడెంలో ఎవడికో కలరా తగిలిందనీ దానికి కారణం యీ పాపిష్టిది వూళ్ళో అడుగు పెట్టడమే అనీ ఒకరన్నారు. అవధాని పెద్దక్కగారు తలుపురెక్క ఓరగా తీసి యిలా అంది. "మేమందరం సిగ్గుతో చచ్చిపోతున్నాం. ఇలా బరి తెగించిన వాళ్ళు వూళ్ళోవుంటే సంసారులగతి ఏమవుతుంది ఆలోచించండి అన్నయ్యా. మమ్మల్ని వూళ్ళో వుండమంటారో లేందే గంగలో దూకమంటారో చెప్పండి."

"ఇంతకీ గవరయ్య యింట్లో లేడుగా. రాగానే పెద్దలు మీరు వెళ్ళి చెప్పండి! మీ మాట వినకుండా వుంటాడా! ఏమైనా చెప్పండి అవధానిగారూ! గవరయ్య యిదివరకటి వాడుకాదు. పాపం పుణ్యం అంటే ఏమిటో తెలుసుకున్నాడు. దైవభక్తి, అంతకన్నా మీరంటే భక్తి కలిగున్నాడిప్పుడు." అన్నాడు ఊళ్ళోకి పెద్ద కామందైన శేషగిరి.

"గవరయ్యమీద యింకా ఎన్నిఆశలు పెట్టుకున్నాం!" అన్నాడు మున్సబు నిట్టూరుస్తూ గుడి ప్రాకారాన్ని, పాతిక వేలనీ తలచుకొని.

"గవరయ్య మేనత్త వుండికదా! ఆవిడేంచేస్తోంది. ఊరుకుందా?" అన్నాడు కరణం.

"ఏం మేనత్తలే బాబూ. ఖాయిలాపడి మంచాన్నంటుకుపోయి వుంది. పాపం. బాగా ముసిల్దయిపోయింది" అన్నాడొకడు.

కనుచీకటి పడేవేళకి గవరయ్య యింటిముందు సైకిలు దిగాడు. ఇంట్లోకి అడుగుపెట్టగానే అవధాని, కరణం, మునసబునీ చూశాడు. కనుబొమలు పైకెత్తి ప్రశ్నార్థకంగా తల ఆడించాడు. అవధాని అంతా చెప్పాడు. గవరయ్య కళ్లు ఎర్రబడ్డాయి. అతని లావాటి పెదవులు వణికాయి. గబగబా వెళ్ళి మూలనున్న గునపం చేత్తో పైకి ఎత్తాడు. "చంపేస్తాను. తప్పేముంటని." అని అరిచాడు. అవధాని కంగారుగా "వొద్దు వొద్దు అంతపని అక్కర్లేదు. గవరయ్య బాబూ. నీ ధర్మనిష్ఠ తెలియనిదా. ఇప్పుడు మళ్ళీ ఖూనీకేసు వొకటా! నీ పీకేకాక మా పీకల మీదకికూడా వస్తుంది. దాన్ని యింట్లోంచి తోలేస్తెయ్య బాలు" అన్నాడు. గవరయ్య అతని మాటలు వినిపించుకోలేదు. పెద్ద పెద్ద అంగలువేసూ లోపలికి వెళ్ళిపోయాడు. ఈ సమయంలో అక్కడ వుండటం తమకే ముప్పని గ్రహించిన ఆ పెద్దలు ముగ్గురూ అక్కడనుంచి జారుకున్నారు. గవరయ్య పాకలోకి వెళ్ళాడు అక్కడ జీబురుగా, చీకటి చీకటిగా వుంది. పాతసామానుతో దుమ్ముతో నిండివుంది. గవరయ్య పరకాయించి చూశాడు. ఒక పక్కగా నేలమీద వెల్లకిలా పడుకున్న పెళ్ళాన్ని చూశాడు. దగ్గరగా వెళ్ళి గునపం పైకెత్తాడు. ఇంతలో ఏదో సంశయం కలిగింది. "ఇది చచ్చిందా ? బతికేవుందా" అనుకున్నాడు. మోకాళ్ళమీద వంగి మొహంలోకి చూశాడు. పీక్కుపోయి పాలిపోయింది మొహం. ఎండిఅట్టలు కట్టినజుట్టు అసహ్యంగా నేల మీద భుజాలచుట్టూ పరచుకొని వుంది. దీనంగా మృత్యు విహ్వలగా, భయంకరంగా, అసహ్యంగా వుంది ఆమె మొహం. "చిట్టీ" అని పిలి

పాపు గట్టిగా. బుజాలు పట్టుకుని కుదిపాడు. చిట్టి కళ్ళు తెరిచింది. గవరయ్యను ఆనమాలు కట్టింది. ఆమె కన్నులమ్మట నీళ్లు కారుతున్నాయి. వణుకుతున్న తన రెండు చేతులనీ పైకెత్తి నమస్కరించింది. "నన్నేం చేయకు నేను వెళ్ళిపోతాను" అంది నీరసంగా. తన తల్లి చచ్చిపోయేముందు యిలాగే తన తండ్రికి చేతులెత్తి దణ్ణం పెడుతూ దీనంగా చూడటం జ్ఞాపకమొచ్చింది గవరయ్యకు. మళ్ళీ చిట్టిచేతులు రెండూ కిందకు వేలాడిపోయాయి. కాసేపు అలాగే కూచుని ఏమనుకున్నాడో లేచి లోపలకు వెళ్ళి ఒక చెంబుతో నీళ్ళూ, ఒక గిన్నెనిండా అన్నమూ తీసుకు వచ్చాడు. "చిట్టీ" అన్నాడు. చిట్టి కళ్లు తెరిచింది. "లే. ఈ అన్నం తిను తెల్లారగానే వెళ్ళిపో. నీ మొహం నాకు చూపించకు తెలిసిందా" అన్నాడు. చిట్టి తల వూపింది. గవరయ్య లేచి నుంచుని "తెల్లవారేక యీ పాకలో కనిపించేవా నీకు చావు తప్పదు" అని యింట్లోకి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి గవరయ్యకి అన్నం సయించలేదు. అతనికి కాళ్ళకింద మంటలు పెట్టినట్టుంది. అవతల ఆకాశంమీద మబ్బులు దట్టంగా పట్టాయి. గాలి రివ్వుమని చెట్ల ఆకుల్లోంచి చప్పుడు చేసుకుంటూ ఇంటి చూరుని తాకి వెర్రిగా అరుస్తూ వెనక్కి తిరిగిపోతోంది. పక్కమీద దొర్లుతూన్న గవరయ్యకి కునుకు పట్టింది. గవరయ్యకి భయంకరమైన కలవచ్చింది. తన తండ్రిని తల్లిని ఒక స్తంభానికి కట్టి చుట్టూ మంటలు పెట్టారు. ఆ మంట పెట్టినవాళ్ళు అవధానిలాగ, కరణంలాగ, మునసబులాగ కనిపించారు. తల్లీ తండ్రీ "బాబోయ్ బాబోయ్" అని అరుస్తున్నారు. తల్లీ తండ్రీ ఎర్రగా నల్లగా బూడిదలా కాలిపోయారు. ఆ బూడిదలోంచి ఒక వ్యక్తి బయటికి వచ్చాడు. ఆ వ్యక్తి గబగబా అడుగు లేసుకుంటూ తన పెరట్లో పాకవైపు వెళ్ళాడు. ఆ వ్యక్తికి ఒక చేతిలో శంఖం, మరొకచేతిలో చక్రం, నుదుట నామాలూ వున్నాయి. గుళ్లో తనుచూసిన వేణుగోపాలస్వామి విగ్రహంలా వున్నాడు. వేణుగోపాలస్వామి కళ్ళమ్మట నీళ్లు కారుతున్నాయి. దేవుడేడుస్తున్నాడు. చిట్టి పక్కలో వున్న పిల్లవాణ్ణి చేతులతో తీసుకొని "నీకేం భయంలేదు. నే నున్నానుగా"

అని చిట్టిని ఓదారుస్తున్నాడు, ఇంతలో మండుతున్న కాగడాలు పట్టుకొని ఊళ్ళో జనం కేకలు వేసుకుంటూ వచ్చి పాకను అంటించేస్తున్నారు. పాక నలువైపులా భగ్గుమని అంటుకుంది. జ్వాలలు మిన్నుముడుతున్నాయి. దేవుడు మంటల్లో కాలిపోతున్నాడు, చిట్టి కాలిపోతోంది. నోరెరుగని చిట్టి పిల్లాడు కాలిపోతున్నాడు.

ఉలిక్కిపడి లేచాడు గవరయ్య. అతని ముఖమంతా చెమటతో తడిసిపోయింది. కిటికీ తలుపులు గాలికి కొట్టుకుంటున్నాయి. హోరుమని గాలి వాన, ఉరుములూ, మెరుపులూ అంతా భయంకరంగా వుంది. గవరయ్య ముఖం తుడుచుకున్నాడు. పక్కనున్న కూజాలోని ఒక గ్లాసుడు మంచి నీళ్ళు గడగడా తాగాడు. చీకటిలోంచి బయటకు చూశాడు. వానతో కలసిన చీకటి, నల్లని విషం లాగా ఆకాశం మించి కారుతోన్నట్లు నల్లని పాపం సముద్రంలా పొంగుతోన్నట్టు వుంది. ఆ భయంకరమైన చీకటిలో యీ మనుషులు, ఇష్టాలు, వాకిళ్ళు, భయాలూ, కోర్కెలూ, అన్నీ అబద్ధంలా కనిపించాయి. ప్రకృతి యొక్క ప్రచండ తాండవంలో ఏదో సత్యం కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లు అర్థమయినట్లు అనిపించింది. ఒక పెద్ద మెరుపు మెరిసింది. ఆ మెరుపులో వేణుగోపాలస్వామి గోపురాగ్రం మెరిసింది. గవరయ్య మనసు లోపల ఏదో మెరిసింది. గవరయ్య దిగాడు. లాంతరుపట్టుకుని పెరట్లో కెళ్లాడు పెరడు చాలా పెద్దది. వర్షంలో తడుస్తూ, గాలి వూపుకి తట్టుకుంటూ పాక దగ్గరికి వెళ్ళాడు. పాకలోంచి కీచుగా, గట్టిగా మూలుగులు వినబడుతున్నాయి. లోపలకు వెళ్లాడు. బాధతో వలయం తిరిగిపోతోంది చిట్టి. చూడలేక దీపం అక్కడ పెట్టి బయటకు వచ్చి నిలుచున్నాడు. అలా వర్షంలో చలి గాలిలో ఎంతసేపు వున్నాడో తెలీనే తెలీదు. ఇంతలో ఒక మెరుపు మెరిసింది. దగ్గర్లోనే ఎక్కడో పిడుగుపడిన భయంకరమైన చప్పుడు. "బాబోయ్" అని అరిచింది చిట్టి. గవరయ్య ఒక్క నిముషం సేపు నిశ్చేష్టుడయ్యాడు. ఇంతలో "కేర్ కేర్" మని ఏడుపు వినిపించింది. కఠినమైన అసహ్యమైన గవరయ్య మొహం మీద లావాటి పెదవుల సందులనుంచి వచ్చిన చిరునవ్వు తాలూకు వెలుగు

అలుముకొంది. గవరయ్య అంతవర్షంలోనూ అంత చీకటిలోనూ మెరుపుల సహాయంతో పూళ్ళో మంత్రసాని కోసం పరిగెత్తుకెళ్ళాడు.

ఉదయం ఎనిమిది గంటలయింది. గవరయ్య ఇంటి వరండాలో అవధాని, కరణం, శేషగిరి, మున్సబూ అందరూ కూర్చుని వున్నారు. వర్షం తగ్గి లేత ఎండ కాస్తోంది. ఆఎండల్లో రాత్రంతాతడిసినచెట్లఆకులూ, పచ్చికా, గవరయ్య యింటిమీద వాలిన కాకి నల్లని రెక్కలూ మెరుస్తు న్నాయి. అవధానీ, మున్సబూ, వాళ్ళ మొహాలు మాత్రం మెరవటం లేదు. నిరాశాహతమైన వారి కళ్ళలో కోపం సుళ్ళు తిరుగుతోంది. గుమ్మం అవతల వాళ్ళ వెనకాలే వచ్చిన వెట్టివాడూ, ఒకరిద్దరు నౌకర్లూ తమరేం చెప్పినా చేసేస్తా మన్నట్టుగా విధేయతా, పట్టుదల మూర్తీభవించినట్లు చేతులు కట్టుకు నుంచున్నారు.

కాసేపటికి ఇంట్లోంచి గవరయ్య వచ్చాడు. నడుస్తున్న ఇనుప గడ్డలా వున్నాడు. చిన్న కళ్ళు కుంచించి సూటిగా, నిర్లక్ష్యంగా వాళ్ళ కేసి చూశాడు. అవధాని భీకరంగా కంఠం మార్చి "ఇలా చేస్తా వనుకోలేదు గవరయ్యా! ఇంకా పెద్దమనిషివి అనుకున్నాను. చెడి పోయిన దాన్ని ఇంట్లోకి తీసుకువచ్చి పెట్టుకుంటావా? ఎవడివల్లో పుట్టిన కొడుకుని ఇంట్లో తెచ్చి పెట్టుకుంటావా! నీకు సిగ్గూ, అభి మానమూ రెండు లేకపోవడమే కాదు. పాపం, మహాపాపం, ఘోర పాపం చేశావు. దేముడింక నిన్ను క్షమించి సహించి వూరుకుంటాడా?" అన్నాడు గుక్క తిప్పుకోకుండా. గవరయ్య తాపీగా గోడ కానుకుని కూర్చున్నాడు. బొడ్లోంచి పొగాకు కాడతీసి చుట్ట చుడుతూ "నాకు దేవుడే చెప్పాడు" అన్నాడు. "ఏం చెప్పాడు" అన్నాడు అవధాని.

"ఆ పిల్లాణ్ని నేను పెంచుకుంటాను. ఆ పిల్ల ఇంట్లో పడి వుంటుంది" అన్నాడు గవరయ్య.

"లేచిపోయిందాన్ని ఏలుకుంటావా?" అన్నాడు శేషగిరి తన చెవుల్ని తాను నమ్మలేక!

"ఏలుకోడం సిగతరగ—నాకంటే సగం చిన్నదాన్ని పెళ్ళిచేసుకుంటే లేచిపోక ఏం చేస్తది. ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతది. తిండీ బట్టా యిస్తే కుర్రాణ్ణి సాకుతూ యిక్కడే పడివుంటుంది" అన్నాడు గవరయ్య. అవధాని వికటాట్టహాసం చేశాడు. "దేవుడు చెప్పాడా నీకు? ఏ దేవుడయ్యా! రంకు దేవుడా? మహా తపస్సు చేసిన వాళ్ళకి దిక్కు లేదుకాని...."

"నాకు దేవుడు కనిపించాడు. నేను దేవుణ్ణి చూశాను!" అన్నాడు మొండిగా గవరయ్య. అప్పుడతని కళ్ళు మెరిశాయి.

"ఇప్పుడైనా దాన్నీ, ఆపిల్లాణ్ణీ ఎక్కడికేనా పంపించేసెయ్. ఇంతటి అన్యాయాన్ని మేము ఒప్పుకోం" అన్నాడు కరణం. "నిన్ను గుడి చాయలకికూడా రానివ్వం" అన్నాడు అవధాని. "ఊరు వూరంతా ఏకమవుతుంది గవరయ్యా! మంచిగా చెబితే వినడంలేదు నువ్వు. మేమంతా చేతులు కట్టుక్కూర్చోలేదు జాగ్రత్త" అన్నాడు మున్సబు.

ఒక్కసారి గవరయ్య లేచాడు. గోడవారనే వున్న గునపం తీశాడు. "ఎవర్రా! నా యాల. నామీద కొచ్చే వాడెవడ్రా! నేనొకరి సొమ్ముతిన్నానా! అసలు మిమ్మల్నిక్కడకు రమ్మన్నానా? నువ్వెవడివయ్యా నాకు నీతులు చెప్పడానికి? నా యవ్వారంలో జోక్యం చేసుకుంటే ఒక్కపేటుకి తెగేస్తాను రమ్మను ఎవడొస్తాడో" అని అరిచాడు గవరయ్య. అతని వొళ్ళు ఆవేశంతో వూగిపోయింది, అతను పేలుతున్న అగ్ని పర్వతంలా వున్నాడు. అతని ఆకారం, అతని రౌద్రం చూసేసరికి వెట్టివాడు భయపడిపోయి నోరావలించాడు. అవధాని లేచాడు. తక్కిన వాళ్ళందరూ కూడా లేచారు. "అయితే దాన్ని వదలవన్నమాట" అన్నాడు అవధాని.

"వదల్ను" అన్నాడు గవరయ్య.

"అయితే నిన్ను వెలేస్తున్నాం. చాకలి, మంగలి రానేరారు సరి కదా నీ పొలంపనులకి. పాలేరు తనానికీ ఎవరొస్తారో చూస్తాను" అన్నాడు అవధాని.

మున్సబు వెట్టిగాడికేసి చూసి "ఈవేళ వూళ్లో టముకు వెయ్యరా" అన్నాడు.

గవరయ్య ఉగ్రంగా వురిమిచూసి "పొండయ్యా పెద్దమనుషులూ, ఇలాంటి యెదవ్వాళ్లో వుండమన్నా వుండను. నా పిల్లాణ్ణి యీ యెదవల మధ్య తిరగనివ్వను. థూ!" అని కాండ్రించి వుమ్మేశాడు. వెళ్ళిపోయే అవధాన్నీ బృందాన్నీ చూస్తూ.

వారంరోజులు తిరిగేసరికి గవరయ్య ఇల్లు తాళంవేసి వుంది. గవరయ్య టౌనులో ఇల్లు కొన్నాడనీ, ఇక్కడ ఊళ్ళో ఇల్లూ, పొలమూ అమ్మకం పెట్టేడనీ తెలిసింది.

(జ్యోతి, 1964)